క్లుప్తంగా

ఏపీఎం కుటుంబానికి ఆర్థిక సాయం



లింగమయ్య కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మండల వైకేపీ ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న లింగమయ్య గౌడు గత నెల 3వ తేదీన మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి తోటి ఉద్యోగులు తమవంతుగా రూ. 3,0,7500 అందజేశారు. కర్నూలు, నంద్యాల జిల్లాల డీఆర్డీఏ పీడీలు సలీమ్ బాషా, శ్రీధర్ రెడ్డి, అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి చెక్కు అందజేశారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



నగదు అందిస్తున్న సర్పంచ్ లాయర్ మహేశ్వరరెడ్డి

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని మీర్జాపురానికి చెందిన మార్కె రమణయ్య కుటుంబ సభ్యులకు ఆదివారం వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను సర్పంచ్ లాయర్ మహేశ్వరరెడ్డి అందజేశారు. రమణయ్య జ్వరంతో బాధపడుతూ కోలుకోలేక శనివారం మృతి చెందాడు. మృతుడి సోదరి లక్ష్మీదేవికి వైఎస్సార్ బీమా పథకం తక్షణ సాయాన్ని గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ఇజ్రాయెల్‌తో కలిసి ఆయన అందజేశారు.

శుభకార్యం

డోన్ : మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదివారం డోన్ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, లక్ష్మీదేవిల కుమార్తె శ్రీలేఖ, సుధీర్‌కుమార్‌ల వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వీసీఎన్ కల్యాణ మండపంలో జరిగిన ఈ వివాహానికి పలువురు పట్టణ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. అదేవిధంగా కామగానికుంట్ల గ్రామానికి చెందిన అయ్యన్న కూతురు వివాహానికి రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, ఎస్కేడీ యూనివర్సిటీ ఈసీ సభ్యులు నాగభూషణంరెడ్డి, సర్పంచ్ వేమారెడ్డి తదితరులు హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వాదించారు.

రక్తదానం



బ్లడ్ డొనేట్ చేస్తున్న దృశ్యం

అవుకు: క్రికెట్‌లో భారత్ 2023 వరల్డ్ కప్ విజేతగా నిలవాలని కోరుతూ మండల కేంద్రం అవుకులో యువకులు ఆదివారం బ్లడ్ క్యాంప్ నిర్వహించారు. పట్టణంలోని నాగుల కట్ట సమీపంలో తాడిపత్రికి చెందిన సేవా బ్లడ్ క్యాంప్ ఆధ్వర్యంలో ఈ క్యాంప్ ఏర్పాటు చేశారు. యువకులు దాదాపు 60 మంది ఇండియా గెలవాలి అని నినదిస్తూ బ్లడ్‌ను డొనేట్ చేశారు. కార్యక్రమంలో యువకులు అశోక్‌కుమార్, మధుకుమార్, విజయ్ కుమార్, జాయ్, రఘు, స్వామి, చాంద్, చిన్న, సతీష్, శివ తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయిబాబా జయంతి



సత్య సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు

బేతంచెర్ల: పట్టణంలోని పూదోట ఆశ్రమంలో భగవాన్ సత్యసాయిబాబా జయంతి వేడుకలను ఆశ్రమ నిర్వాహకులు గుండాగోపాలు, ఈశ్వర్ ప్రసాద్, రమేష్ , రామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్త బృందం భజనలు, బాలికలు సంప్రదాయ వేశధారణలో ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

నేడు షాదీఖానా నిర్మాణానికి భూమి పూజ

బనగానపల్లె : పట్టణం తమ్మడపల్లె రహదారిలో రూ.1.20 కోట్లతో చేపట్టనున్న నిర్మించనున్న షాదీఖానా నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి భూమి పూజ చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ముస్లింలతో పాటు జెడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్, వార్డు సభ్యులు వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

పౌష్టికాహారం పంపిణీ

డోన్ : ప్రభుత్వాసుపత్రిలో రోగులు, బాలింతలు, గర్భిణులకు ఆదివారం స్థానిక ప్రార్థన మందిరం నిర్వాహకులు జాన్ ప్రభాకర్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం అందజేశారు. ఎల్ఐసీ డెవలప్‌మెంట్ అధికారి రాజశేఖర్ ఆర్థిక సాయంతో రోగులకు రొట్టె, గుడ్డు, పంపిణీ చేశామని జాన్ ప్రభాకర్ తెలిపారు.

బస్సు యాత్ర విజయవంతం చేద్దాం

- 22 బనగానపల్లెకు సామాజిక సాధికార బస్సు యాత్ర
- ఐకమత్యంగా స్వాగతం పలుకుదాం
- ముఖ్య నాయకుల సమావేశంలో ఎమ్మెల్యే, జెడ్పీచైర్మన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చిత్రంలో జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: బనగానపల్లె పట్టణానికి ఈనెల 22న రానున్న వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రజలు, పార్టీ శ్రేణులు, అభిమానులకు పిలుపునిచ్చారు. ఆదివారం కొలిమిగుండ్లలోని పార్టీ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. బస్సు యాత్రలో సినీ నటుడు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రభుత్వ సలహాదారు ఆలీ, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, డిప్యూటీ సీఎంలు నారాయణస్వామి, పిడిక రాజన్నదొర, బీద మస్తాన్‌రావు తదితర ప్రముఖులు వస్తున్నారన్నారు. వీరికి ఐకమత్యంగా స్వాగతం పలికేందుకు ప్రతి పల్లె నుంచి తరలివచ్చేలా నాయకులు కృషి చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలు లబ్ధిపొందారని, ఆ విషయాన్ని వివరించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. పార్టీలు, కులాలు ఇవేవి చూడకుండా అందరికీ ప్రభుత్వ ఫలాలు నేరుగా అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. ప్రభుత్వం చేసిన మంచిని బస్సు యాత్ర ద్వారా ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారన్నారు. వీరిని గత ప్రభుత్వ పాలకులు ఓటు బ్యాంక్‌గా మాత్రమే చూశారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలే కాక ఎంతో మందికి రాజకీయ పదవులు ఇచ్చి గుర్తింపు కల్పించిందన్నారు. ప్రభుత్వం ఇంకో ముందడగు వేసి కుల, గణనకు శ్రీకారం చుట్టిందన్నారు. దీని ద్వారా సామాజిక, ఆర్థిక స్థితిగతులు తెలిసిపోతాయన్నారు. బస్సు యాత్ర నియోజకవర్గమంతా తెలిసేలా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ క్రిష్టారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు గుర్విరెడ్డి, రామాంజనేయులు, ఈశ్వరయ్య, నాయకులు మూల ఈశ్వరరెడ్డి, పులి ప్రకాష్‌రెడ్డి, బీవీ జగన్, తోట మల్లేశ్వరరెడ్డి, బాలస్వామిరెడ్డి, లక్ష్మిరెడ్డి, యాతం పెద్దిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఉలవల నరసింహుడు, బీగాల వెంకటసుబ్బయ్య, రామచంద్రుడు, నాగమల్లేశ్వరరెడ్డి, బాబూజీ, వెంకటసుబ్బయ్య, పులి పెద్దిరెడ్డి, రామసుబ్బారెడ్డి, ఓబులేసు, ఓబయ్య, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు జలదుర్గంలో పల్లెకు పోదాం

ప్యాపిలి: మండల పరిధిలోని జలదుర్గంలో సోమవారం పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయం 1 పరిధిలోని ప్రజలకు ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ పథకాల గురించి అధికారులు, ప్రజా ప్రతినిధులు వివరిస్తారన్నారు. అలాగే స్థానికంగా జరిగిన అభివృద్ధి గురించి వివరిస్తారని చెప్పారు. అదేవిధంగా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేడు ముదిగేడులో....

సంజామల: మండల పరిధిలోని ముదిగేడు గ్రామ సచివాలయం పరిధిలో సోమవారం పల్లెకు పోదాం కార్యాక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగకుమార్ తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పనితీరు, ఆయా కుంటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తారన్నారు. అదేవిధంగా ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా శ్రీ షిరిడీ సాయిబాబా మందిర రజతోత్సవం

బనగానపల్లె రూరల్ : పట్టణ పరిధిలోని అవుకు రోడ్డు ఎస్ఆర్‌బీసీ కాలనీలో ఉన్న శ్రీ షిరిడీ సాయిబాబా మందిర 25వ రజతోత్సవం ఆదివారం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఉదయం బాబాకు కాగడ హారతి, పాలాభిషేకం నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా రథంపై కొలువుంచి జీఎం టాకీస్, పెట్రోల్ బంకు ఆస్థానం రోడ్డు, పాతబస్టాండ్, అమ్మవారిశాల మీదుగా ఎస్ఆర్‌బీసీ కాలనీలోని శ్రీషిరిడి సాయి నాథ్ దేవస్థానం వరకు గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి కమిటీ అధ్యక్షులు శ్రీరామవెంకట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే శ్రీషిరిడీసాయి బాబాను దర్శించుకొని తీర్థప్రసాదం స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డితో పాటు ఆయన సోదరుడు కాటసాని తిరుపాల్‌రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షులు కేతేపల్లి శివచంద్రయ్య, గుండా శ్రీనివాసులు, సభ్యులు గాథంశెట్టివేణు గోపాల్, గుండా రవికుమార్, జక్కా సుబ్రహ్మణ్యం, తిరుపాల్‌గౌడ్, సురేష్, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.



శ్రీ షిరిడీ సాయిబాబాకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

వ్యవసాయానికి ఈ వారం విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామమోహన్ చెప్పారు. కోవెలకుంట్ల, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల కింద జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. గుళ్లదూర్తి సబ్ స్టేషన్ పరిధిలోని పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

సంజామల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటిపూట వేళల్లో ఏడు గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు విద్యుత్ ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. ఆల్వకొండ, ముక్కమల్ల, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపురి, ముదిగేడు, ఎగ్గోని, కానాల, అక్కం పల్లె, గిద్దలూరు, లింగందిన్నె, అక్కంపల్లె, రామిరెడ్డిపల్లె మంగపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 6 నుంచి సాయంత్రం 1 గంటల వరకు, పేరుసోముల సబ్ స్టేషన్ పరిధిలోని పల్లెలకు 5 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు.

సాంబశివాలయంలో ప్రత్యేక పూజలు

డోన్ టౌన్ : కార్తీక మాసం పురస్కరించుకొని సాంబ శివాలయంలో స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు కల్లె శేషావలిశర్మ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగానికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, అన్నాభిషేకం, అర్చనలు తదితర పూజలు చేసి మహా మంగళ హారతి ఇచ్చారు. డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సతీమణి ఝాన్సీ రాణి, హెచ్ఎం వెంకటసుబ్బారెడ్డి తదితర భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.



స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

హిందూ ధర్మం సనాతనమైనది

నంద్యాల(వ్యవసాయం): హిందూ ధర్మం ఎంతో పురాతనమైన, సనాతనమైనదని సాంస్కృతిక సంప్రదాయాలకు నిలయం మన దేశమని శ్రీశైలం రుషి సంస్కృతి ప్రచార సేవా సంస్థ, ఆధ్యాత్మిక గురువు శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. ఆదివారం హిందూ ధర్మా సమ్మేళన కార్యక్రమాన్ని పురస్కరించుకొని పట్టణంలో నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం వివేకానంద ఆడిటోరియంలో సమ్మేళన కార్యక్రమం చేపట్టారు. కొలనుభారతి శారదా పీఠం పీఠాధిపతి శ్రీ శివయోగేంద్ర సరస్వతి స్వామి మాట్లాడుతూ హిందువుల వేదసంపద అమూల్యమైనదని, వేదాంత శాస్త్రం, తత్వ శాస్త్రం, పురాణాలు, ధర్మాన్ని ఆచరించడానికి కావాల్సిన లోతైన జ్ఞానాన్ని హిందూ ధర్మశాస్త్రం విషదీకరిస్తుందన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ నంద్యాల అధ్యక్షుడు చింతలపల్లె వాసు, రామకృష్ణ డాక్టర్ రామకృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డి, సురేంద్రాజీ, మాధవరెడ్డి, దాసరి శ్రీనివాసులు, అపర్ణ దీపిక పాల్గొన్నారు.

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్

ప్రతి హామీని అమలు చేస్తున్నాం



పీహెచ్‌సీ భూమి పూజ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని, నాపరాతి గనులకు నిలయమైన అంకిరెడ్డిపల్లె గ్రామస్తులు ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న పీహెచ్‌సీ కల నేటితో నిజమైందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం అంకిరెడ్డిపల్లె సమీపంలోని తుమ్మలపెంట క్రాస్ రోడ్డు వద్దనున్న సాయిబాబా ఆలయం ఎదురుగా రూ.2.55 కోట్లతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి(పీహెచ్‌సీ) గ్రామ నాయకుడు కెపి రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి వారు మాట్లాడారు. 2019 ఎన్నికల ప్రచారానికి వచ్చిన సమయంలో గ్రామ నాయకులు, ప్రజలు పీహెచ్‌సీ కావాలని కోరారన్నారు. విద్య, వైద్య రంగాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారని, రూ. కోట్లు ఖర్చు చేస్తున్నారని గుర్తు చేశారు. పీహెచ్‌సీ ఏర్పాటుతో గనుల కార్మికులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పీహెచ్‌సీపీక ఇప్పటికే ఇద్దరు వైద్యులను ప్రభుత్వం నియమించిందని, మొత్తం 13 మంది సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. నిర్మాణ పనులు పూర్తి అయ్యే వరకు గ్రామంలో అద్దె భవనంలో ఆసుపత్రి నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ పీహెచ్‌సీ అత్యాధునికమైన పరికరాలు ఇచ్చేందుకు ముందుకు రావడం సంతోషకరమన్నారు. రూ.10 లక్షల విలువ మిషనరీ ఇస్తానని ప్రకటించిన కేపీ రామ్మోహన్‌రెడ్డిని వారు అభినందించారు. భవిష్యత్‌కు గ్యారెంటీ పేరుతో గ్రామాలకు వెళ్తున్న టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డికి ఐదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు ఏమి చేశారని ప్రశ్నించారు. కొలిమిగుండ్ల మండలంలో పేదలకు అసైన్‌మెంట్ కింద భూపంపిణీ చేస్తుంటే హైకోర్టులో పిల్ వేసి అడ్డుకోవడం... బనగానపల్లెలో 3వేల మందికి ఇళ్ల పట్టాలు ఇస్తుంటే ఓర్వలేక అడ్డుకున్న నీచ చరిత్ర బీసీదని, ప్రజాగ్రహం చవిచూడక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగన్న, వైస్ ఎంపీపీ దస్తగిరి, ఆర్అండ్‌బీ డీఈ సునీల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, గ్రామనాయకులు అంబటి రామ్మోహన్‌రెడ్డి, కొప్పుల చంద్రశేఖర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, అంబటి నరసింహారెడ్డి, సూర్యనారాయణరెడి, పెద్ద బొజ్జయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీలు అభివృద్ధిపై దృష్టి సారించాలి

కోవెలకుంట్ల: ఎస్టీలు సామాజిక, రాజకీయ రంగాల్లో రాణించాలని, అభివృద్ధిపై దృష్టి సారించాలని కోవెలకుంట్ల మార్కెట్‌యార్డు డైరెక్టర్ కాకి కృష్ణుడు, ఎరుకలిసంఘం కోవెలకుంట్ల అధ్యక్షుడు నాసారి సిద్ధయ్య అన్నారు. నంద్యాలలో ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే ఎరుకలి మహాసభకు కోవెలకుంట్లకు చెందిన ఎస్టీలు తరలివెళ్లారు. సభకు వెళ్లిన వారిలో నాయకులు వెంకటరమణ, మురళీ, రమేష్, కుమార్, రమణ, సుంకయ్య, నరసింహులు, రాజన్న, అశోక్, కార్తీక్, ఈరన్న తదితరులు ఉన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

బేతంచెర్ల: మండల పరిధిలోని గోర్లగుట్ట గ్రామానికి చెందిన కొప్పెర విజయమ్మను ఆమె భర్త ఏసు రత్నం, అతని అక్క సుబ్బమ్మ, మరోవ్యక్తి రాజు ముగ్గురు కుటుంబ కలహాలతో గొడవ పడ్డారు. తనపై దాడి చేశారని స్థానిక పోలీస్ స్టేషన్‌ల్లో విజయమ్మ పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి ఏఎస్ఐ లింగమయ్య ఆదివారం తెలిపారు.

వేధింపుల కేసు నమోదు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామానికి చెందిన చాయేశ్వరిని బళ్లారికి చెందిన బండారు ప్రవీణ్ కుమార్‌కు 2017లో ఇచ్చి వివాహం చేశారు. అదనపు కట్నం తేవాలని భర్తతో పాటు అత్త రామలింగమ్మ, మామ శ్రీనివాసులు తరచూ వేధింపులకు గురిచేస్తున్నారంటూ స్థానిక పోలీస్ స్టేషన్‌ల్లో చాయేశ్వరి ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై వేధింపుల కేసునమోదు చేసినట్లు ఎస్ఐ శివశంకర్ నాయక్ ఆదివారం తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

బనగానపల్లె రూరల్ : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని బనగానపల్లె గ్రంథాలయశాఖ అధికారి బషీర్ అహమ్మద్ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం దిశా చట్టం, మహిళా సాధికారితపై చర్చ కార్యక్రమంతో దివంగత ఇందిరా గాంధీ జయంతిని నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దిశా చట్టంపై ఏఎస్ఐ లక్ష్మణ అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ సాలమ్మ, చిట్టెమ్మ, వైఎస్సార్‌క్రాంతి పథకం సీసీ హైమావతి మాట్లాడారు. ఆర్థికాభివృద్ధిపై మహిళలు దృష్టి సారించాలని సూచించారు. అనంతరం ఏఎస్ఐలక్ష్మణతో పాటు సాలమ్మ, చిట్టెమ్మ,హైమావతిలను గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు సన్మానించారు.

డోన్ టౌన్ : దివంగత ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆమె చిత్ర పటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ గార్లపాటి మద్దిలేటి, ఉన్నిగోర్ల జనార్ధన్, శేఖర్, వడ్డే రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: దివంగత ప్రధాని ఇందిరా గాంధీ 106వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం పలువురు నివాళులర్పించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో అధికారి మధుశేఖర్ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం విద్యార్థులకు స్వాతంత్ర ఉద్యమంలో గ్రంథాలయాల పాత్ర అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.



ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

సంజామల: జాతీయ గ్రథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం గిద్దలూరు పుస్తక సంక్షిప్త కేంద్రంలో సంజామల గ్రంథాయల అధికారి బాల తిమ్మరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు దిశ చట్టం–అవగాహన– విద్యార్థుల పాత్ర అంశంపై వ్యాచరన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పుస్తక సంక్షిప్త కేంద్రం నిర్వహకులు మద్దిలేటి, రిటైర్ తెగులు ఉపాధ్యాయుడు చెన్న కేశవ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

మాలధారులకు వస్త్రాల అందజేత

నంద్యాల(వ్యవసాయం): సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భవానీ దీక్షదాలకు ఆదివారం వస్త్రాలు అందజేశారు. ఫౌండేషన్ నాయకుడు చింతలపల్లె వాసు మాట్లాడుతూ పది మంది మాలధాలకు దాతలు సాంబారపు నాగప్రసాద్, అనఘా, బైరెడ్డి వెంకటరెడ్డి, లోకేశ్వరరెడ్డి సహకారంతో వస్త్రాలు అందజేశామని చెప్పారు.

బిడ్డకు భరోసా..తల్లికి రక్షణ

- అంగన్‌వాడీ కేంద్రాలకు ఔషధ కిట్లు
- జిల్లాలో 1.663 కేంద్రాలకు సరఫరా
- ఒక్కో ఫస్ట్ ఎయిడ్ కిట్‌లో ఏడు రకాల మందులు



అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన మందులు



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం(ఫైల్)

డోన్ రూరల్: మాతా,శిశు సంరక్షణకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుంది. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెడుతోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు సమకూర్చారు. నాడు–నేడు ద్వారా పాత భావనాలను ఆధునీకరించింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. ప్రైవేటు భవనాల్లో నడుస్తున్న కేంద్రాలకు అద్దెను పెంచింది. అదేవిధంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై సైతం ప్రత్యేక దృష్టి పెట్టింది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా పౌష్టికాహారం అందిస్తోంది. చిన్నారులకు ఇంగ్లీషు మీడియం బోధనకు శ్రీకారం చుట్టింది. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రతి నెలా మొదటి మూడు శుక్రవారాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను వైద్యులు సందర్శించేలా ఆదేశాలు జారీ చేసింది ప్రభుత్వం. గర్భిణులకు, బాలింతలకు టేక్ హోంరేషన్ విధానం అమలు చేస్తున్న ప్రభుత్వం నాణ్యతలో రాజీలేకుండా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్(ఎస్ఓపీ) అమలులో కచ్చితత్వం పాటించేలా చర్యలు చేపట్టింది. క్వాలిటీ సర్టిఫికేషన్ తప్పనిసరి చేసింది.


ఒక్కో కిట్‌లో ఏడు రకాల మందులు

అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు 19రకాల ఆట వస్తువులతో కిట్లను అందజేస్తుంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. పిల్లల ఎదుగుదలకు స్టడీ, ఇన్‌ఫాంటో మీటర్లు, సాల్టర్‌స్కేల్, బరువు తూచే యంత్రాలను సమకూర్చింది. తాజాగా జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు అత్యవసర ప్రథమ చికిత్స (ఫస్ట్ ఎయిడ్) కిట్లు పంపిణీ చేసింది. ఒక్కో కిట్‌లో ఏడు రకాల మందులు ఉంటాయి. పారాసిటమాల్ సిరప్, సిప్రోఫ్లాక్సిన్ చుక్కల మందు, ప్రమిసటిన్ స్కిన్ క్రీమ్, కాటన్, ఓవర్ రీహైడ్రేషన్ సొల్యూషన్, సొనిడిన్ అయోడిన్, రోలర్ బ్యాండేజ్ ఉన్నాయి. సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం పేరిట పిల్లల్లో సాధారణంగా వచ్చే వ్యాధులు, ఏయే మందులను ఎంతెంత మోతాదులో ఎలా వినియోగించాలో పేర్కొంటూ తెలుగులో సమాచారం కూడా పొందపరిచారు. ఆయా మందుల వినియోగంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు వైద్యులు. బిడ్డకు భరోసా, తల్లికి రక్షణ కల్పిస్తున్న ప్రభుత్వ సేవలపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలోని అంగన్‌వాడీ వివరాలు...

జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు	:6
అంగన్‌వాడల కేంద్రాలు	: 1,663
మినీ కేంద్రాలు	: 43
గర్భిణులు	: 12,974
బాలింతలు	:12,972
ఆరునెలల నుంచి ఏడాదిలోపు పిల్లలు	: 13,734
ఏడాది నుంచి మూడేళ్లలోపు పిల్లలు	: 48,156
మూడు నుంచి ఆరేళ్ల మధ్య పిల్లలు	: 27,708

ఎంతో ప్రయోజనం...



అంగన్‌వాడీ కేంద్రాలకు మెడికల్ కిట్లు పంపిణీ చేశాం. గతంలో కంటే ఈ సారి వచ్చిన కిట్లలో ఎక్కువ మందులున్నాయి. ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. పిల్లలకు జ్వరం, చిన్నపాటి గాయాలు, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తితే ఈ కిట్‌లోని మందులు ఎంతో ఉపయోగపడతాయి. పిల్లలో సాధారణంగా వచ్చే చర్మవ్యాధుల నిర్మూలనకు అయింట్ మెంట్లు ఇందులో ఉన్నాయి.

– షంషాద్‌బేగం, ఐసీడీఎస్. సీడీపీఓ డోన్

ఫస్ట్ ఎయిడ్ కిట్‌పై అవగాహన కల్పించాం



తల్లి, బిడ్డ సంరక్షణకు తమవంతు కృషి చేస్తున్నాం. ఫస్ట్ ఎయిడ్ కిట్స్ చిన్నారులకు ఉపయోగకరం. వీటిపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించాం. ఏఎన్ఎం, ఆశావర్కర్లు ప్రతి మూడు నాలుగు రోజులకోసారి అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి ఆరోగ్య సూత్రాలు వివరిస్తారు.

– సుగణమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, జలదుర్గం సెక్టార్

మహానందీశ్వరుడి సన్నిధిలో హైకోర్టు రిజిస్ట్రార్



ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ నరసింహులును సన్మానిస్తున్న ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో ఆదివారం పలువురు ప్రముఖులు పూజలు నిర్వహించారు. ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ నరసింహరావు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి వారికి స్వాగతం పలికి పూజలు నిర్వహింపజేశారు. అలాగే కర్నూలు జిల్లా న్యాయమూర్తి ఎస్. శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జీలు రాధారాణి, వి.ఆదినారాయణ, ఏడీజే జి.అర్చన పూజలు చేపట్టారు. స్థానిక అలంకార మండపంలో వారికి శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేయించారు. అలాగే.. సీఐడీ ఎస్పీ నగేష్, కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు. దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఇన్‌స్పెక్టర్ ముడియం చంద్రశేఖర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ మేరకు వారు శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని పూజలు చేపట్టారు. అనంతరం స్థానిక యాగశాలలో వారికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేయించారు. వారి వెంట హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.